# లోజ్వరం

> "మీ కథలన్నీ సమాజ దర్పణాలు, సందేశ పూరితాలు, శిల్పభరితాలూ. ఈ కథానిక గురించి ఇంతకంటే కితాబులెందుకు ?"
>
> - సిహెచ్.వి. బృందావనరావు ( విజయవాడ )

బలగమంతా ఆయన్ని అదోలా పరిగణిస్తారు...

కొందరు 'స్థితప్రజ్ఞు'డంటే... కొందరు 'రాతిబొమ్మ' అంటారు. ఎక్కువమందికి ఆయన అంటీముట్టని మనిషి!

జరుగుతున్న సంగతిని చెప్తాను...

నా బావమరిది శ్రీకాంత్ బి.టెక్. చదువుతున్నాడు. ఫస్ట్ ఇయర్. కాలేజీలో ర్యాగింగ్ హద్దుమీరి జరిగింది. సున్నిత మనస్కుడు. చాలా కలత పడ్డాడు. రాత్రి నిద్రమాత్రలు మింగాడు. పెద్ద బావమరిది సురేష్ ఫోన్ చేశాడు. హాస్పిటల్‌లో చేర్చారు శ్రీకాంత్‌ని.

టైమ్ చూశాను... ఐదయింది- తెలతెలవారుతోంది!

నాన్నని తీసుకురమ్మన్నాడు.

ముందు నా భార్య సుమిత్రని నిద్ర లేపి విషయం చెప్పాను. చాలా కంగారుపడింది. అమ్మ అప్పటికెప్పుడో లేచే ఉంది. నాన్న కాఫీ తాగుతున్నాడు.

నేనూ, సుమిత్ర తయారవుతున్నాము. మియాపూర్ పోవాలి. మేముండేది చైతన్యపురి.

నాన్నని అడిగాను- "మరి, మీరూ వస్తున్నారా?" అని.

"మీరేమీ కంగారుపడకండిరా! అతనికేం కాదు. ఇట్టాంటి కేసుల్లో పోలీసులూ, గట్రా చాలా గొడవలుంటయ్‌రా విశ్వం. అవన్నీ నా మెడకు చుట్టుకోలేను. సురేష్‌ని చూసుకోమను. మీరు పోయిరండి!" అన్నాడు.

విసవిసా గదిలోకి నడిచింది సుమిత్ర. అదోలా నావైపు చూసింది. నాన్న మాటల పట్ల నిరసన భావం ఆమె చూపులో చదువుకోగలిగాను.

పక్క చూపులు చూస్తూ నేనూ కదిలాను.

మరికొద్దిసేపటికి తయారైనాము నేనూ, సుమిత్ర. అమ్మకి చెప్పి కదులుతున్నాం. పిల్లలిద్దరి గురించి అమ్మకేవో సూచనలిస్తోంది సుమిత్ర.

నాన్న అన్నాడు- "ఆ హాస్పిటల్ వాతావరణం నాకు పడదు. అయినా కానున్నది కాక మానదు. మీరు వెళ్లిరండి!"

నాతోపాటు సుమిత్ర విన్నది.

ఆటోరిక్షాలో-

సుమిత్ర రుసరుసలాడుతూనే ఉంది. ఆమెకి కోపంగానూ, ఉక్రోషంగానూ ఉంది- "మీ నాన్నగారికి లోకంలో జరిగే సంఘటనలన్నీ అతిసాధారణమైనవిగానే కనిపిస్తాయి. అంటీముట్టని మనిషి. ఏ సెంటిమెంటూ లేదు."

నేనేమీ అనలేదు. నా ఆలోచన ఎక్కడో ఉంది.

"డిపార్ట్‌మెంట్‌లోనూ, హాస్పిటల్‌లోనూ పరిచయస్థులున్నారనేగా ఆయన హెల్ప్ అడిగేది?" సుమిత్ర నిష్ఠూరం.

రిక్షా ముందుకు పోతోంది.

నా ఆలోచనల్లో నాన్న మేల్కొన్నాడు.

నా చిన్నతనంలో మా బాబాయి పెళ్ళికి పోతుంటే నిడదవోలు స్టేషన్‌లో తమ్ముడు కాశీ తప్పిపోయాడు. అమ్మతో సహా అందరూ నానా కంగారూ, వెదుకులాట, భయ పడుతుంటే ఈయన ప్లాట్‌ఫారమ్ మీద తురాయి చెట్టుక్రింద కునుకు తీశారుట! చివరికి సందెవేళకి ఎవరో తెచ్చి అప్పజెప్పారు వాణ్ణి.

"నే చెప్పలా ఏం కాదని!" అన్నాడు నాన్న.

అప్పుడు మేం బందరులో ఉంటున్నాం. సంపూర్ణక్క తొలికాన్పుకొచ్చింది. కాన్పు కష్టమవుతోంది. మంత్రసాని మంగమ్మ హాస్పిటల్‌కి తీసుకుపొమ్మంటుంది. ఈయనేమో "నీ హస్తవాసి మంచిది. కానీ"మంటూ అరుగుమీద కూర్చున్నాడు. అర్ధరాత్రికి కాన్పు అయింది కానీ, పుట్టినబిడ్డ అర్ధగంటలోనే పోయింది.

"ఏదెట్టా జరగాలో అట్టా జరుగుతుంది. ఏడ్చినా, మొత్తుకున్నా ఏం లాభం? దాని ఖర్మ దానిదీ..." ఇదీ నాన్న!

చిన్నక్క పెళ్ళి సంబంధం ఖాయం చేసుకొచ్చి కూర్చున్నాడు. చేతిలో డబ్బు లేదు. పెట్టిన లోన్లు రాలేదు.

"ఫర్వాలేదు... ముహూర్త బలముంటే అదే జరుగుతుంది!" అని ఆఫీస్ పనిమీద టూర్‌కి వెళ్లాడు. చివరికి మా మావగారు అప్పట్లో ఈయన కొలీగే- తాను పి.ఎఫ్.లోన్ తీసి ఆదుకున్నారు.

"నే చెప్పలేదూ... ఏదెట్టా జరగాలో అట్టా జరుగుతుంది!" అని, తన సూత్రాన్నే వల్లె వేశారు. మా మావగారు పోయి చాలా కాలమైందిప్పటికి.

"దిగండి..." అన్న హెచ్చరికతో ఈ లోకంలో పడ్డాను.

మా బ్యాగ్‌లు అత్తగారింట్లో పడేసి హాస్పిటల్‌కి పరిగెత్తాం. అప్పటికే శ్రీకాంత్‌ని ఐ.సి.యు.లో ఉంచారు. అత్తగారు అతని దగ్గర ఉన్నది. బయట హాల్లో కూర్చున్నాం. సురేష్, అతని భార్య రమణి, సుమిత్ర చెల్లెలు రాణీ, ఆమె భర్త మోహన్, ఒకరిద్దరు సురేష్ ఆఫీస్ మిత్రులూ ఉన్నారు.

సురేష్ అడిగాడు- "నాన్నగారు రాలేదే?" అని.

నేను మౌనంగా సుమిత్ర వైపు చూశాను. ఆమే చెప్పింది-

"ఆయనకీ హాస్పిటల్ వాతావరణం పడదులేరా!" అని. నా మనస్సు చివుక్కుమన్నా 'నిజమే కదా...' అనిపించింది.

ర్యాగింగ్ భూతం గురించీ, కాలేజీల్లో యువత పోకడలు, ఏవేవో మాటలు సాగినై. ఆ తర్వాత ఉద్యోగాలూ, సెలవులూ, ధరలూ, ఈతిబాధలూ... అన్నీ ఊసుపోక మాటలు.

ఈలోగా ఒకటి రెండుసార్లు ఐ.సి.యు. వార్తలొచ్చినై. కడుపులో ఎక్కడో హెమరైజ్ జరిగిందనీ, ఆపరేషన్ చేయాలనీ.

అందరి మనసుల్లో ఆందోళన! సురేష్, మోహన్ డబ్బు ఏర్పాటు చేశారు.

ఆపరేషన్ అయ్యేసరికి రాత్రి ఎనిమిది దాటింది. మళ్లీ శ్రీకాంత్‌ని ఐ.సి.యు.కి తరలించారు.

మర్నాడు మధ్యాహ్నం -

నాన్న హాస్పిటల్‌కొచ్చాడు. అమ్మ కూడా ఉంది. ఏవో మాటలు నడిచినై.

"ఏదెలా జరగాలో అలా జరుగుతుంది. మేం వస్తాం!" అంటూ కదిలాడు నాన్న. అమ్మ ఆయన్ని అనుసరించింది.

అప్రయత్నంగా సుమిత్ర చూపు నామీద వాలింది. నేరం చేసినవాడిలా తల వంచుకున్నాన్నేను.

ఆ రాత్రి నేనూ, సుమిత్ర హాస్పిటల్ నుంచి అత్తగారింటికి వెళ్తుంటే అన్నది సుమిత్ర- "మీ నాన్నగారికి పరిస్థితులూ, పరిసరాలూ తెలీవు. ఏమిటీ ఆయనగారి డైలాగులు? అమ్మ చాలా బాధపడింది..." అని. నేను మౌనం వహించాను.

క్షణం తర్వాత అన్నాను– "ఆయన తత్త్వం తెలిసిందేగా... వదిలెయ్!"

నాలుగు రోజులు గడిచాయి.

శ్రీకాంత్ పరిస్థితేం బాగోలేదు.

మేమంతా షిఫ్ట్ డ్యూటీల్లో హాస్పిటల్‌లో ఉంటున్నాం.

ఆ రోజు రాత్రి–

నేనూ, సురేష్ ఉన్నాం శ్రీకాంత్ దగ్గర. మా కళ్ళముందే నిద్రలోనే చనిపోయాడు శ్రీకాంత్.

మా అత్తగారిల్లు మూర్ఛరోగిలా బాధతోనూ, దుఃఖంతోనూ కొట్టుకోసాగింది.

నాన్న ఫోన్‌లో సురేష్‌ని పరామర్శిస్తూ "అయితే చనిపోయాడన్నమాట!" అన్నాడట. అతను చాలా బాధపడ్డాడు.

"ఏమిటోనోయ్ విశ్వం! మీ నాన్న ఈ లోకంతోనూ, మనుషులతోనూ ఏమాత్రం సంబంధం లేనివాడిలా పలకరించారు..." అన్నాడతను.

నా మనసులో ముల్లు గట్టిగానే దిగింది.

హఠాత్తుగా నాకు మా తమ్ముడు కాశీ గుర్తుకొచ్చాడు...

వాడు టెన్త్ చదువుతుండగా ఒకరోజు స్కూల్‌కి వెళ్లినవాడు మళ్లీ తిరిగి ఇంటికి రాలేదు. అనేక విచారణలు, వెదుకులాట. ఇల్లంతా బోసిపోయి ఉండేది. మా మొహాలన్నీ ఆరిన కుంపట్లలా ఉండేవి. నాన్నమాత్రం "వాడే సన్యాసుల్లోనో కలిసి ఉంటాడు" అని వదిలేశాడు.

ఏళ్లు గడిచినై. ఇప్పటికీ ఎవరన్నా ఆ ప్రసక్తి తెస్తే ఆయన అనే మాట అదే! ఇవాళ పరామర్శ కూడా అలాగే గదా ఉంది. అదీ ఆయన స్పందన!

శ్రీకాంత్ మరణం మమ్మల్నందర్నీ బాగా క్రుంగదీసింది. సుమిత్ర ఆ బాధతో కుమిలిపోసాగింది.

రోజులు భారంగా గడుస్తున్నాయి. అంతో ఇంతో అమ్మ తనకి మానసిక స్థైర్యాన్నిస్తున్నా మామూలు మనిషి కాలేకపోతోంది సుమిత్ర.

ఓ రోజు రాత్రి–

సుమిత్ర అన్నది– "నేను మావయ్యగారితో మామూలుగా మాట్లాడలేకపోతున్నానండీ!" అని. క్షణం ఆగి "ఆయన స్వభావమూ, మాటలూ నా మనసుకి సలుపుగా ఉన్నాయి" అన్నది.

ఏం చెప్పగలను? దిక్కులు చూస్తూ ఉండిపోయాను.

ఉన్నట్టుండి నాకేదో అనుమానం కలిగింది–

'సుమిత్ర వేరింటి కాపురం దిశగా లాగుతోందా ఆలోచనల్ని!' అని. కానీ, ఆమె నోట ఆ మాట రాలేదు. అమ్మ మాట్లాడదు. నాన్న తన పని తాను చేసుకుపోతూ ఉంటాడు. పిల్లలకి వాళ్ళ స్కూలూ, చదువులూ, రవ్వంత తీరిక దొరికితే టీ.వీ. సుమిత్ర ముభావం. ఇల్లంతా పొలిమేరల్లో ప్రశాంతి!

నాకు పరమ ఇరుగ్గా ఉంది. దినచర్య యాంత్రికంగా సాగుతోంది.

మా కుటుంబ సభ్యులకీ, నాన్నకీ మధ్య ఇతమిత్థంగా చెప్పుకోలేని దూరం పెరుగుతోందని తెలుస్తూనే ఉంది. నాన్న ఉదాసీన వైఖరీ, అన్నిటికీ "ఏమీ కాదులేరా!" ధోరణీ, ఏమైనా సంభవించినా దాని గురించి ఎదుటివారు ఆశించే సాధారణ స్పందన కూడా లేకపోవటం, ఏదో వేదాంత ధోరణి... ఇవన్నీ మాకు మింగుడుపడటం లేదు.

నలుగురమూ కలిసి కూర్చుని హాయిగా మనసు విప్పి మాట్లాడుకోలేని స్థితి ఎదురయింది. ఎవరికి వారు సమూహంలో ఒంటరిలా, ఒక ద్వీపకల్పంలా అయిపోయాము.

రెండు నెలలు గడిచాయి.

ఒకరోజు రాత్రి–

హాల్లో సవ్వడికి లేచి మా గదిలోంచి బయటికొచ్చాను. నా వెనగ్గా సుమిత్ర.

హాల్లో నాన్న పచార్లు చేస్తున్నాడు.

అర్థంకాలేదు. టైమ్ చూస్తే... మూడూపది. వాళ్ళ గదిలో లైట్ వెలుగుతోంది. ఆయన తమ గదిలోకి నడిచారు. మేమూ వెళ్లాం!

మంచం మీద అమ్మ మూలుగుతోంది. హీనస్వరంగా ఉంది. కళ్ళు తుడుచుకుంది. తలకి స్కార్ఫ్ బిగించి కట్టుకుని ఉంది. అస్థిమితంగా కదులుతోంది.

"ఏమైందమ్మా?" అడిగాను.

"ఏం లేదురా... ఏం లేదు..." తొట్రుపడింది.

"చెప్పండత్తయ్యా! ఎలా ఉంది?" సుమిత్ర కంగారుగా అడిగింది.

మౌనంగా మా కళ్ళల్లోకి చూసింది అమ్మ.

సుమిత్ర అమ్మ పక్కగా మంచంపట్టె మీద కూర్చుని అమ్మ తలమీద చెయ్యి వేసింది– "జ్వరమేమైనా ఉందా?" అంటూ.

"లేదమ్మా!" అంది చాలా సాత్వికంగా!

గుమ్మం బయట నిలబడివున్న నాన్న చెప్పాడు– "ఒంటిగంట నుంచీ తలనొప్పిటరా! తల తిరిగినట్టయిందట! ఫర్వాలేదు... సర్దుకుంది."

తెలివి తెచ్చుకుని ఏదో అనేలోగా తనే అన్నది సుమిత్ర– "హాస్పిటల్‌కి తీసుకుపోదాం... పదండి!" అని.

"అక్కర్లేదు సుమిత్రా! తగ్గింది. ఫర్వాలేదు..." నాన్న.

"మీరు రిక్షా పిలవండి!" సుమిత్ర అన్నది నాతో.

నాన్న తన గొంతు పెంచి విసుగ్గా అన్నాడు- "అక్కర్లేదు. చెప్తున్నాను గదా! తెల్లారేసరికి నార్మలవుతుంది. మీరు పడుకోండి!"

సుమిత్రకి పిచ్చికోపం వచ్చింది. ఠక్కున లేచింది-

"మీ వేదాంతంతో ఆమెని చంపేస్తారా? మూర్ఖత్వానికీ ఒక హద్దుండాలి!" అని అరిచేసింది. అసంకల్పంగా "సుమిత్రా! ఏమిటా మాటలు?" అని నేనూ కోపగించుకున్నాను.

చాలాసేపటికి పరిస్థితి సద్దుమణిగింది.

అమ్మ తల నొక్కుతూ ఉపశమనం క్రియలు సలుపుతోంది సుమిత్ర.

నేనూ స్టూలు లాక్కుని పక్కగా కూర్చున్నాను. అమ్మ గోడవైపు తిరిగి పడుకుంది.

క్షణాల తర్వాత లేచి నేను ఆ వైపు వెళ్లి చూశాను... నిద్ర పట్టిందేమోనని!

ఆమె కళ్ళ నిండా నీళ్లు!

దగ్గరగా కూర్చున్నాను. నా చేతిని తన చేతిలోకి తీసుకుంది. లాలనగా స్పృశించింది. పక్కగా కునుకు తీశాను.

ఐదు దాటుతుండగా...

"అత్తయ్యా!" అంటూ గావుకేక పెట్టింది సుమిత్ర.

హంస ఎగిరిపోయింది.

కర్కశంగా తెల్లవారింది.

"బ్రెయిన్ హెమరైజ్ అయివుంటుంది. హాస్పిటల్‌కి తీసుకుపోతే బతికేది పాపం!" వంటి అభిప్రాయాలు చాలా విన్నాం.

నాన్నని గట్టిగా దూషించింది సుమిత్ర...

పనిలో పనిగా నాకూ పడినై అక్షింతలు.

●

కర్మకాండలన్నీ ముగిశాయి...

నాన్న మౌనదీక్షలో ఉన్నట్టు ఉండిపోయాడు.

రోజులు గడుస్తున్నాయి.

ఇప్పుడు నాన్న-

ఏ సమయానికేం కావాలో అది అందిస్తే తీసుకుంటాడు...

ఇది కావాలని అడగటం లేదు, అది వద్దని చెప్పటం లేదు. ఎవరికేం జరిగినా "ఏమీ కాదులేరా!' అని చెప్పిన మనిషేనా ఈయన?' అనిపిస్తోంది.

ఒకరోజు నేను బయటినుంచి వచ్చేసరికి మా ఇంటిమూలగా ఉన్న సువర్ణగన్నేరు మొదట్లో కూర్చుని ఉన్నాడు నాన్న. నేను విస్తుపోయాను.

ఏదన్నా మట్టి సర్దుతున్నాడేమోననుకుని దగ్గరికెళ్లాను. చూశాడు.

"ఏమిటి నాన్నా?" అడిగాను.

సమాధానం లేదు. చేతులు మట్టిలో పెట్టి తవ్వుతున్నాడు. నాకు గుండెలు జారినై. ఏమిటో అర్థంకాలేదు. ఇంతలో సుమిత్ర వచ్చింది. ఆమె అప్పటికే వెక్కుతోంది!

"మావయ్యని చూస్తుంటే కడుపు తరుక్కుపోతోంది నాకు. మనిషిలో జీవకళ లేదు. మునుపట్లా లేడీయన. నాకేమీ అర్థంకావటం లేదు..." అని కొంగు నోటికి అడ్డం పెట్టుకుని గ్రుడ్లనీరు కక్కుకుంటోంది.

నేను నివ్వెరపోయాను. నాన్న పరిస్థితి సరే– సుమిత్ర... ఇదేమిటీ? ఆయన పట్ల నిరసన, కోపం, ఉక్రోషం అవన్నీ ఏమయినై? మానవ స్వభావాల్లోని వైరుధ్యాల్ని ఎలా అర్థంచేసుకోవాలి?

"నాలుగు రోజుల్నుంచీ మరీ మనిషి మనిషిగా లేదు. ఎప్పుడూ పెదవులు కదిలిస్తూ ఏదో గొణుక్కుంటున్నారు. నేలమీద ఆనని అడుగులతో నడుస్తున్నారు..." అన్నది తన మాటలకి కొనసాగింపుగా.

యోగి అనుకోవాలా? రోగి అనుకోవాలా? నాన్న ఏ సెంటిమెంటూ లేని మనిషా? జబ్బ పట్టి లేపి ఆయన్ని లోపలికి తీసుకువెళ్లాను. చేతులూ, కాళ్లూ కడిగించాను. గ్రహణం పట్టిన సూర్యుడిలా ఉన్నాడు.

ఆ పక్కగా మా పిల్లలు బిక్కుబిక్కుమంటూ నిలబడి ఉన్నారు. పెద్దది వాసంతి అంటోంది– "తాతయ్యకి నానమ్మ కావాలి నాన్నా... నాకు తెలుసు!" అని.

సుమిత్ర వైపూ, వాసంతి వైపూ చూపులు మార్చి మార్చి చూశాను.

'ఆడపిల్ల అంటేనే నిలువెత్తు అమ్మతనం!' అనిపించింది!!

●

' చిత్ర ' మాసపత్రిక ... ఆగస్ట్ ' 2010 సంచికలో ప్రచురితమైన కథ